రెండు శవాలు

తొలి కోడితో లేచి, తన వంగ తోటకు నీళ్ళు పట్టుకుని, అలిసిపోయిన శరీరాన్ని నదిలో ముంచాలని, నది వేపు దారి తీస్తూ... దారిలో వున్న పాడుబావి లోకి అనుకోకుండా ఓసారి తొంగి చూసి... వులిక్కిపడి, తల లాక్కుని... మళ్ళీ కళ్ళు అంతవి చేసుకుని చూసి కెవ్వుమన్నాడు రంగయ్య. రంగయ్యకు ఒంటి మీద స్పృహ తప్పినట్టయింది. తను చూసింది నిజమా కలా అనుకున్నాడు. వూపిరీ, పెదవులూ బిగించి మరోసారి బావిలోకి చూడ సాగాడు. ఈసారి అతను పూర్తిగా, స్పష్టంగా చూశాడు-బావి నీళ్ళలో తేల్తూ రెండు శవాలు కనిపించినై!...

రంగయ్యకు వొళ్ళు మరింత చెమట పట్టింది. ఏమిటో మాట్లాడబోయినాడు-గట్టిగా అరవబోయినాడు. పెదవులు తెరుచుకున్నాయి గాని, కంఠంలోంచి స్వరం రాలేదు. రంగయ్య కొయ్యబారి పోయాడు-తమాయించుకుని, వెనక్కు వచ్చి అటూ ఇటూ చూశాడు. కనుచూపు మేరలో ఎవరూ కనిపించలేదు. కొన్ని ఫర్లాంగుల దూరంలో తన వూరు మాత్రం కనిపిస్తున్నది. రంగయ్య ఏమీ తోచని వాడల్లే తనను ఎవరో తరుముతున్నట్టుగా ఊరికేసి పరిగెత్తసాగాడు- రొప్పుకుంటూ!

''కసరత్తు మొదలెట్టావా ఏమిటి రంగయ్యా?'' అని పక్క నుంచి నవ్వుతూ పలకరించాడు-కరణంగారి అబ్బాయి వేణు. ఈ పిలుపుతో రంగయ్య తన కాళ్ళకు బంధాలు పడ్డట్టు ఠక్కున ఆగాడు.

''గోరం చినబాబూ-గోరం'' అన్నాడు రంగయ్య బావి కేసి చూపిస్తూ.

వేణు ఏవిఁటని ప్రశ్నించే లోగానే రంగయ్య చెప్పసాగాడు-

''పెందలకడ లేసి ఎవళ్ళ మొహం చూశానో గాని-రామ రామ...నూతి కాడి కెళ్ళి లోపలికి తొంగి సూద్దును-రెండు సెవాలు బాబూ రెండు'' అన్నాడు తడబడుతూ.

వేణు ఆగమ్యంలో పడ్డాడు.

''ఏమిటి రంగయ్యా-శవాలా? బావిలోనా?'' అంటూ పరుగెత్త సాగాడు. వెనకాలే రంగయ్యా పరుగెత్తాడు. ఇద్దరూ బావి గట్టుమీద నుంచి లోపలికి తొంగి చూశారు- నిశ్చలంగా రెండు శవాలు-ఒకటి మగ, ఒకటి ఆడ – ఒకదాన్నొకటి ఒరుసుకుంటూ పాడునీళ్ళలో తేల్తున్నాయి!

ఒక్క గంటసేపట్లో, వూరువూరంతా ఆ వార్త పాకిపోయింది. ''వూరవతల వున్న పాడు బావిలో రెండు శవాలు'' అన్న వార్తే గాని-రెండో మాట వూళ్లో వినిపించలేదు. సగం వూరంతా బావి ప్రాంతాలకు వచ్చింది. ఆడవాళ్ళూ మగవాళ్ళూ, ముసలాళ్ళూ, అంతాచేరి ఓసారి బావిలోకి తొంగి చూసి ''రామ రామ'' అనో 'నారాయణ' అనో అనుకుంటున్నారు.

''ఏమి చోద్యమమ్మా'' అన్నది వెంకమ్మ చుక్కమ్మతో.

''పోయే కాలం కాకపోతేనూ- హయ్యో!'' అని నోరు నొక్కుకున్నది చుక్కమ్మ.

''కలియుగం'' అన్నాడు నరశింహులు నారాయణతో.

''ఎవడికి పుట్టినబుద్ధి చెప్మాయిది?'' అన్నాడు నారాయణ.

''భార్యా భర్తలిద్దర్నీ గొంతులు నొక్కేసి నూతిలో పారేశాడు. వీడి చేతులు పడిపోనూ, వీడికిచేతులు ఎట్లావచ్చాయో'' అనుకున్నది సుబ్బమ్మ.

''హత్యలా! ఆత్మహత్యలా!'' అనుకున్నాడు వెంకటేశ్వర్లు, డిటెక్టివ్ సాహిత్యం తనపై ప్రసరించిన జ్ఞాన కిరణాలవల్ల.

''ఇదేదో భగ్న ప్రేమ'' అని వాపోయాడు ప్రణయకథల పాఠకుడు సుబ్బారావు.

'పాడుబావిలో రెండు శవాలు' వార్త, పక్కవూళ్లకు కూడా పాకింది. ఇసక వేస్తే రాలనంత జనం పోగయినారు. అంతటా అడావుడి, కోలాహలం, పెద్దగా గోల, కేకలు!!

ఊళ్ళోవున్న అంతమందీ చేరారు గాని - ఆ శవాల ముఖాలు సరిగా తెలియక పోవటం వల్ల ఎవరూ గుర్తు పట్టలేదు. 'ఎవరు చెప్మా ఎవరు చెప్మా!' అనుకున్నారు. ఎవరూ ఏడుస్తూరాలేదు కాబట్టి, ఈ వూరువాళ్ళు కాదేమోనని ఎవరో అన్నారు. 'దిక్కులేనివాళ్ళేమో' అని ఒకడన్నాడు. 'ఆకలిచావులు' అని మరొకడన్నాడు.

మునసబూ, కరణమూ, పోలీసు వాళ్ళూ వచ్చారు. జనాన్ని దూరంగా తరిమి అదుపులో పెట్టారు. రెండు శవాల్నీ పైకి తీయించారు. ఒకటి మగవాడు, కుర్రాడే.

పాతిక సంవత్సరాలుంటాయి. పాంటు, చొక్కా వున్నాయి. రెండోది ఆడ శవం, చీరె, రవికా, చేతికి ఒకటి రెండు గాజులూ వున్నాయి. వయసు ఇరవై సంవత్సరాలు కూడా వుండవేమో!...

కరణంగారి అబ్బాయి వెంటనే ఆ మగశవాన్ని గుర్తుపట్టాడు- అది ఆనందరావు అనే యువకుడిది. ఆనందరావును కరణంగారి అబ్బాయి వేణు ఎరుగును. ఇంకొకాయన ఎవరో-ఆ అమ్మాయిని గుర్తుపట్టాడు. తన యింటిపక్కన వున్న నాగభూషణం భార్య లక్ష్మి... కొద్దిసేపట్లో ఆ రెండు శవాలూ ఎవరివో వూరంతా తెలిసిపోయింది.

పోలీసువాళ్ళు ఈ శవాల్ని పంచాయితీకి పంపారు. శవాల శరీరాలపై కత్తిపోట్లు గాని, మరే విధమైన దెబ్బల గుర్తులు గాని లేవు. గొంతుపిసికి నూతిలో పారేసినట్లుగా కూడా అనుమానించడానికి లేదు. క్రితం రాత్రి పన్నెండు ఒంటిగంటల మధ్య ఈ మరణాలు జరిగి వుంటాయని, ఆత్మహత్యలు కావచ్చునని నిర్ధారణ చేశారు పంచాయితీవారు. ఆనందరావు జేబులో వెతికితే ఒక అథమరకం సిగరెట్టు పెట్టె, ఒక అగ్గిపెట్టె, కొన్ని చిల్లర డబ్బులు దొరికాయి. చీరా, రవికా, గాజులూ తలలో రెండు పువ్వులు మినహా మరేం దొరకలేదు లక్ష్మి దగ్గిర.

ఈ శవాలను వాళ్ళ బంధువులకు వప్పగించాలని పోలీసువాళ్ళు చూశారు. ఏడ్చుకుంటూ ఎవరన్నా వస్తారేమోనని చాలాసేపు నిరీక్షించారు. ఎంతకూ ఎవరూ రాలేదు. ఆనందరావు విషయమై సబ్‌ఇన్‌స్పెక్టరు వేణును చాలా ప్రశ్నలు వేశాడు.

''ఆనందరావుకు, నాకూ పెద్దస్నేహం ఏం లేదు కాని, బాగా తెలుసు. సాధారణంగా పఠనమందిరంలో కలుసుకునే వాళ్ళం. అతను ఒక్కడే ఇక్కడుంటు న్నాడు, ఏదో ఆఫీసులో వుద్యోగం చేసుకుంటూ. అతని బసకు నేనెప్పుడూ వెళ్లలేదు గాని - పెద్దరోడ్డుకు అడ్డంగావుండే రంగనాథం వీధిలో ఒక చిన్న గదిలో వుంటున్న ట్టుగా నాతోచెప్పాడు. హోటల్లో భోజనం. వయస్సు పాతిక సంవత్సరాలుంటాయి. మనిషి చాలా మంచివాడు, నవీన భావాలు కలవాడూనూ. సిగరెట్లు జోరుగా కాల్చే వాడు. ఎంతసేపూ పుస్తకాలు చదువుకునేవాడు. ఎంత పిల్చినా పేకాటకు గాని, క్యారమ్స్ ఆటకు గాని, మరో ఆటకు గాని వచ్చేవాడు కాదు. తనకు పెళ్ళికాలేదనీ, తల్లి వున్నదని, ఆమె ఎక్కడో తన అన్నయ్య దగ్గిర వుంటున్నదనీ చెప్పాడు. ఇంతకంటే నాకేం తెలీదు'' అన్నాడు వేణు.

''ఆనందరావు ఎప్పుడూ మీ దగ్గర ఈ అమ్మాయి విషయం ప్రస్తావించలేదా?'' అనడిగాడు ఇన్‌స్పెక్టరు.

''లేదు''

''తనను పెళ్ళి చేసుకోమని వాళ్ల అమ్మ ఉత్తరాలు రాస్తే, వాటి మీద ఇతని భావాలు ఎట్లా వుండేవో మీ కేమయినా తెలుసా?''

''నేను కూడా పెళ్లి సంగతి అడిగేవాడిని. నవ్వి వూరుకునేవాడు.''

''పెళ్లి చేసుకోవాలని గాని, వొద్దని గాని ఏమి అనలేదన్న మాట.''

''ఏమీ లేదు''.

''ఈ అమ్మాయి ఎవరో మీకు తెలుసా?''

''నాకు తెలీదు. నే నెప్పుడూ చూడలేదు. ఇప్పుడు వినడం వల్ల వీళ్ళది ఫలానా వీధి అని అనుకుంటున్నాను. ఆ వీధిలో ఒక్కొక్కప్పుడు ఆనందరావు కనిపించేవాడు'' అన్నాడు వేణు.

''ఆహాఁ!'' అన్నాడు, ఇన్‌స్పెక్టరు. అని ''ఆ బావిలో శవాలను మొదట చూసింది మీరే కదూ!'' అన్నాడు.

''కాదు. ముందు రంగయ్య చూశాడు. నాతో చెబితే నేను చూశాను''.

ఇన్‌స్పెక్టరు రంగయ్యను కొన్నిప్రశ్నలడిగాడు. ఉదయం తను శవాల్ని ఎట్లా చూడటం తటస్థించినదీ, వేణుకు ఎట్లా చూపించినదీ వున్నది వున్నట్టుగా చెప్పాడు-రంగయ్య.

పోలీసులు ఆనందరావు గదిని వెతికారు. ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు ఎక్కడా ఏ ఉత్తరమూ రాసిపెట్టబడలేదు. చిన్నగది-గదిలో ఓ చాప, చిన్నపెట్టే, కొన్ని పుస్తకాలు, కాయితాలూ మినహా చెప్పుకునేందుకు మరేం వస్తువులు లేవు. ఉత్తరాలేవో దొరికాయిగాని-ఈ లక్ష్మి రాసిన ఉత్తరాలేవీ దొరకలేదు. మామూలు విషయాలతో స్నేహితులు రాసినవీ పెళ్ళి విషయమై తల్లి రాసినవీ ఆ వుత్తరాలు.

ఈ విషయం అతని తల్లికి తెలియ జెయ్యాలని పోలీసువాళ్ళు ఆమె చిరునామా కోసం ప్రయత్నించారు. లభ్యం కాలేదు. కార్డుపై వూరు పేరు మాత్రం రాసివున్నది. ఆనందరావు ఆఫీసులో పనిచేస్తున్న అతనితోటి గుమాస్తాలను కూడా వాళ్ళ తల్లి చిరునామా గురించీ, ఇతర విషయాల గురించి, అడిగారు. తల్లి చిరునామా తెలియదన్నారు. ఇతర విషయాలు వేణు చెప్పినట్టే చెప్పారు. తనకో ప్రియురాలు

వున్నట్టుగా ఆనందరావు చెబుతూవుండేవాడనీ, పోతే ఆమె ఎవరయినదీ తను చెప్పేవాడు కాదనీ ఒక మిత్రుడన్నాడు.

లక్ష్మి విషయమ్మై ఆరా తీయగా ఆమె భర్త నాగభూషణం నాలుగు రోజులుగా వూళ్ళోలేడని తేలింది. లక్ష్మి పొరుగింటి సూర్యనారాయణా, అతని భార్యా ఈ విషయం చెప్పారు.

''నాగభూషణం మా యింటి పక్కనే వున్నా అతనితో నాకంత స్నేహంలేదు. అసలు నేనే స్నేహితంగా మెలగను లెండి-అతనిదంతా అదో పద్ధతీ-'' అన్నాడు సూర్యనారాయణ సాగదీస్తూ.

''ఏమిటా పద్ధతి?'' అన్నాడు ఇన్‌స్పెక్టరు.

''అంటే ఏముందీ-మనిషిదగ్గర కలుపుగోరుతనం, మంచితనం ఏంలేదు. ఎప్పుడో ఇంటికి వస్తాడు - భార్యపై ఏదో కేకలువేస్తాడు - తిడతాడు...''

''అతని వుద్యోగం?''

''ఉద్యోగం ప్రస్తుతం ఏంలేదు. నెల రోజులనుంచీ ఖాళీగానే వుంటున్నట్టున్నాడు. వేళకు వెళ్ళటం రావటం ఏమీలేదు. అంతకు పూర్వం ఏదో మిల్లులో గుమాస్తాగా వుండేవాడు.''

''లక్ష్మి ఎట్లాంటిమనిషి?'' అన్నాడు ఇన్‌స్పెక్టరు

''లక్ష్మి మంచిపిల్లే! నాతో చనువుగా మాటాడుతూ వుండేది. పిన్నిగారూ అంటూ పిల్లలాగే తిరిగేది. ఎంతసేపూ ఇంటిపని చూసుకునే సరికే ఐపోయేది – పాపం! వాళ్ళ ఆయనంటే దానికి ఇంతా అంతా భయంకాదు!'' అన్నది సూర్యనారాయణ భార్య.

''నాగభూషణం ఎక్కడికి వెళ్ళాడో తెలీదా?''

''తెలీదండీ, నాలుగు రోజులు అయింది వూళ్లోనే లేడు. ఎక్కడికో పనిమీద పొరుగూరు వెళ్ళాడని మాత్రం లక్ష్మి చెప్పింది. ఏ వూరు అని నేనడగలేదు సుమా - నాకెందుకు ఆ గొడవలు?'' అన్నది సూర్యనారాయణ భార్య.

''సరే, నాగభూషణం వూరు వెళ్ళి తిరిగి రాలేదన్నమాట కదూ?''

''నాకు తెలిసినంతవరకూ రాలేదనే అనుకోవాలి'' అన్నాడు సూర్యనారాయణ.

లక్ష్మి ఇల్లంతా వెతికారు. ఒక చిన్నగదీ, వంటయిల్లూనూ. వంట యింట్లో కాస్త పాత్ర సామాగ్రీ. రెండు చింకి చాపలూ, రెండు చీరెలూ, ఏవో గుడ్డలూ, పాత పత్రికలూ తప్ప ఇంకేం లేవు. పాత వుత్తరాలేవో దొరికాయిగాని ఆనందరావు లక్ష్మికి రాసినవి ఏవీ దొరకలేదు.

పోలీసు వాళ్ళు నాగభూషణానికి అతని భార్య మరణ విషయం తెలియ జెయ్యాలని పొరుగూళ్ళు చూశారు-జాడేలేదు.

ఊళ్లో ఎక్కడచూసినా బావిలో తేలిన రెండు శవాల విషయమే చర్చ. కరణంగారి చావిడిలో, మునసబుగారి వాకిట్లో, పార్కులో, హోటళ్లలో, వూరు వూరంతటా ఇదే విషయం.

''ఆనందరావు లక్ష్మిని గాఢంగా ప్రేమించాడు. అందుకు సందేహం లేదు. లక్ష్మికి పెళ్ళి కాకపూర్వం ఆనందరావు ఆమెను ఎరుగునట- తెలుసా?''

''అవునూ - నాకు తెలీదా యేవిఁటి? వాళ్లిద్దరూ పెళ్ళి చేసుకోవాలని చాలా ప్రయత్నించారు. పరిస్థితులు అనుకూలించలేదు. లక్ష్మి తండ్రికి ఆనందరావు మీద ఇష్టంలేదు. ఆ కారణంచేత ఆమెను నాగభూషణానికి ఇచ్చాడు. ఈ వూళ్లో నాగభూషణానికి వుద్యోగం. లక్ష్మి ఇక్కడికి వచ్చింది. ఆమెతో పాటే ఆనందరావూ మకాం మార్చేశాడు-''

''చాలా రోజులవరకూ నాగభూషణం ఈ విషయం ఎరగడు. ఈ మధ్యనే తెలుసుకుని లక్ష్మిని నానా తిట్లూ తిట్టి చావబాదాడు. ఆనందరావును హతమార్చాలను కున్నాడు కూడానూ!''

''ఈ సంగతి తెలుసుకుని, ఇద్దరూ ఆత్మహత్యచేసుకోవాలని నిర్ణయించు కన్నారన్నమాట... 'ప్రేమ' ఎంతపనయినా చేయిస్తుంది...''

''దీని మొహం ఈడ్చా- దీనికేం పోయేకాలం... కట్టుకున్న మొగుడంటూ వుంటే, వాడిని కాదని వెధవ వేషాలు...''

''కలియుగం ఒదినగారూ-వింటున్నాం కామూ ఇలాంటి విషయాలు? ఇందు లో ఆశ్చర్యం ఏముంది?''అన్నది ఒకామె.

''అసలు ఇద్దరూ ఆ రాత్రి నూతి దగ్గర కలుసుకుందామనుకున్నారట- ఎవరో వస్తున్న అలికిడి కాగా, నూతిలోకి దూకేశారట,'' అన్నది రెండో ఆమె.

మరొకామె నవ్వింది - ''అంత పిచ్చివాళ్ళేం కాదులెండి, తెగించిన వెధవలకి మనిషి అలికిడి లక్ష్యమా ఏమిటి-ఏమో-చచ్చారు. పీడా పోయింది. ఇలాంటి పాపాలమ్మలు బ్రతికితే భూమాతకూ, మనకూ బరువే!'' అన్నది.

''కాని లక్ష్మి...ఎన్ని వేషాలు... ఎన్ని వేషాలు... నాకు మొదట్నుంచీ అనుమానమే. దీని రకం, వ్యవహారం చూస్తే ఇదేం సంసారప్పిల్లలాగా నాకేం కనిపించలేదు!''

''లక్ష్మిని మీరు ఎరుగుదురా ఏమిటి?''

''ఎరక్కేం- నీళ్లకోసం వెళ్లినప్పుడల్లా అక్కడ ప్రత్యక్షం... అబ్బ... ఆ సింగారం! ఆ నడకా...''

''పోనీలెద్దురూ-ఎవరి వెర్రి వాళ్ళకానందం. దానిష్టం-మనకెందుకు?'' అన్నది కొత్తగా పెళ్ళయిన ఒక అమ్మాయి, లేచి వెళ్తూ.

''దీని బతుక్కి ఇదీ చెప్పటమే...'' అన్నది ఒకామె.

''ఎవరీ పిల్ల?''

''మన రాజరత్తం కోడలులే. ఆఁ-కోడలూ నా మొహమునూ! ఆ కొడుక్కి ఎక్కడో ఉత్తరాదిన వుద్యోగం- ఈ పెళ్ళాంగారు ఇక్కడ నానా వేషాలు వేస్తూ...'' అని గొంతుతగ్గించి ''వాళ్ళింట్లో అద్దెకున్నాడులే ఓ కుర్రాడు వాడిని పెట్టుకుని...'' అన్నది.

''రామ రామ... ప్రపంచం అంతా ఒఖలా వుంది... మార్కెట్లు మండిపోతున్నాయంటే మండవూ మరి?''

లక్ష్మి ఇంటి ప్రక్కన వుండే సూర్యనారాయణ, నాగభూషణాన్ని తిట్టసాగాడు. నాగభూషణం ప్రవర్తన వల్లే లక్ష్మి ఇట్లా తయారయిందన్నాడు.

''వీడు పెందరాళే కొంపకు జేరుతూ, వేళపట్టున ఇంటిలోవుంటూ పెళ్ళాన్ని అదుపులో పెట్టక్కర్లా? అందుకే వీడిని చూస్తే దానికి మంట. ఏవో డబ్బులు తెచ్చేవాడు; తాగేసి అర్ధరాత్రి కొంపకు జేరేవాడు...''

''మీ బుద్ధికి మీరూ అనడమే-వూరుకుందురూ! మీరు మాత్రం పెందరాళే కొంపకు జేరుతున్నారా- తిండి తింటున్నారా- మీ కదిగో - ఆ ముండ వున్నంతకాలం...'' అన్నది అతని భార్య.

''దాని సంగతే నిన్ను ఎత్తొద్దన్నాను. చచ్చినట్టు పడి వుండు లేకపోతే పో.'' అని లేచాడు సూర్యనారాయణ.

''పడేవున్నాను. అంత బంగారమూ మీ కింద తగల బెట్టి- ఇదిగో నెత్తీ నోరూ మూసుకుని ఇలా నిలబడ్డాను-'' అన్నది కళ్లమ్మట నీరు గ్రక్కుతూ సూర్యనారాయణ భార్య.

''నోర్ముయ్- ఏడుస్తావేం? నువ్వూ ఆ నూతిలో పడిచావు - ఆ లక్ష్మితో పాటు''

''అలాగే చస్తాను...పాపం...దాని చావు తల్చుకుంటే నా గుండె బద్దలయి పోతోంది.. చక్కదనాల పిల్ల... ఒకరి జోలి, బాధా అక్కరలేని పిల్ల... ఇంత పనికి ఎట్లా తెగించిందో, అమాయకురాలు... ఆ వెధవ ఎవడో ఏం మందు పెట్టాడోగాని-''

''ఇదేం తక్కువదా ఏమిటి? నువ్వు దాన్ని సమర్థిస్తా వెందుకు? అది నన్నే వల్లో వేసుకుందామని చూసిందిగా!'' అన్నాడు సూర్యనారాయణ గొప్పవాడల్లే.

లక్ష్మి ఆనందరావుల చావులగురించి ఇట్లా రకరకాలుగా చెప్పుకోసాగారు. ఆత్మ హత్యలని కొందరూ, పోలీసువాళ్ళు కాదంటున్నా 'హత్యలే' అని కొందరూ మాట్లాడసాగారు. ఆనందరావు గురించీ, లక్ష్మి గురించి పోలీసువాళ్ళు వీలయినన్ని వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలనుబట్టి వాళ్ళిద్దరూ గాఢప్రేమికులేనని తేల్తున్నది. నాగభూషణానికి తెలిస్తే రభస అవుతుందనీ, లోకం ఆడిపోస్తుందని ఇట్లా బలవంతపు చావులు చచ్చారనీ పోలీసుల భావన.

బావిలో శవాలు దొరికిన ఆ సాయంత్రం వరకూ పోలీసులు ఆ కళేబరాలను అట్లాగే వుంచారు. వాటి బంధువుల కోసం ప్రయత్నించి ఎవరూ అప్పట్లో వచ్చే సూచనలు కన్పించకపోగా వాటిని దహన పర్చారు.

ఆ సాయంత్రం పోలీసు స్టేషనుకు ఒక సాక్ష్యం వచ్చింది. వూరు చివర వుంటున్న ఒకాయన, లక్ష్మి, ఆనందరావూ కలిసి క్రితం రాత్రి అటు వెళ్ళటం చూశానన్నాడు. ''అదే రంగు గుడ్డలు – వాళ్ళేలెండి. ముఖాలు నేను చూడలేదు గాని – సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు.''

అతన్ని పోలీసులు మరేవో ప్రశ్నలు వేశారు! అతను సమాధానాలు ఇచ్చాడు.

''ఆత్మహత్య చేసుకుందామని అనుకునేవాళ్లు అంత సరదాగా వెళ్తారా?'' అనుకున్నాడు ఇన్‌స్పెక్టరు. ఈ సరదాగా వెళ్ళడాన్నిబట్టి చూస్తే ఆత్మహత్య

చేసుకుందామనే వుద్దేశం వీళ్ళకు లేనట్టుంది. ఏమయినా వీళ్ళ చావుల గురించి రకరకాల భోగట్టాలు వినవస్తున్నై. ఇందులో ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో ఏమీ తెలీటం లేదు. ఆఖరికి పోలీసువాళ్ళు ఒకటి కావచ్చుననుకున్నారు. ఏమిటంటే - నాలుగు రోజులుగా నాగభూషణం వూళ్ళోలేడు. వెళ్ళేముందు భార్యతో పోట్లాడి వెళ్ళాట్ట. ఆ తర్వాత రానే లేదు. లక్ష్మీ ఆనందరావూ సాధారణంగా వూరవతల బావిగట్టుమీద కలుసుకుంటూండేవారు కాబోలు- అందుకని నాగభూషణం తను వూళ్ళో లేనట్టు నటించి వూళ్ళోనే ఎక్కడో వుంటూ, రాత్రి వూరవతల వాళ్ళకోసం ఎదురుచూస్తూ, ఆ రాత్రి అక్కడికి వచ్చి, వాళ్ళా గట్టు మీద కూర్చుని వుండగా నాగభూషణం ఇద్దర్నీ బావిలోకి తోసేసి, తన మానాన తాను పారిపోయివుంటాడు! ఆ తొయ్యటంలో వాళ్ళు కేకలు వేసినా, వూళ్ళో వాళ్ళకు వినిపించటానికి - దూరం కాబట్టి ఆస్కారంలేదు- ఇదే కావచ్చునని చాలామంది అభిప్రాయపడ్డారు. ఏమయినా ఈ నాగభూషణాన్ని వెతికి తెస్తేనే గాని, విషయం తేలదు. అందుకని పోలీసువాళ్ళు నాగభూషణం కోసం ఆ రాత్రినుంచి తీవ్రంగా గాలించటం ప్రారంభించారు....

భూలోకం విడిచి ఏ లోకానికో పోతూ రెండు ''ఆత్మలు'' గగనమార్గంలో దగ్గరగా కలుసుకున్నాయి. చాలా దూరం నుంచీ, ఆ రెండూ దూర దూరంగా కలిసే వస్తున్నాయి. ఒకరోజంతా అట్లా ప్రయాణం చేసిన తరువాత ఒక 'ఆత్మ' తెగించి మరో ఆత్మను ప్రశ్నించింది.

''ఎవ్వరు నువ్వు?''

రెండో ఆత్మ సమాధానం చెప్పలేదు. ఎందుకో విచారంగా వున్నది.

''ఇదుగో - నిన్నే- నువ్వు ఎవరో చెబుదూ కాస్త'' అన్నది మొదటి ఆత్మ మళ్ళీ.

రెండో ఆత్మ నెమ్మదిగా అటు తిరిగి ''అంత తెలుసుకోవల్సిన అవసరం ఏముంది?'' అన్నది.

''కాదు, వూరికే కాస్సేపు మాటాడుదూ, మనస్సేం బాగాలేదు.''

''నేనేమీ మాట్లాడేస్థితిలో లేను. నా మనస్సు అంతకన్నా చిరాగ్గా వున్నది''

''అందుకనే ఇద్దరమూ కాస్సేపు మాట్లాడుకుందాం - ఆ చిరాకులు మర్చి పోదాం''.

''ఐతే విను. నాపేరు లక్ష్మి - మాది ఫలానా వూరు.'' అన్నది ఆ ఆత్మ.

''ఏమిటి- నీ పేరు లక్ష్మి! ఆ ఫలానా వూళ్ళో బావిలోపడి చచ్చిపోయిన లక్ష్మివి నువ్వేనా?''

''అవును నేనే. నువ్వు ఎవరు – అంత ఆశ్చర్యపడుతున్నావు?''

''నా పేరు ఆనందరావు'' అని నవ్వాడు- ''నువ్వు నాకు రాసిన వుత్తరాలకోస మట- నా గదంతా చిందరవందర చేశారు. ఒక్కసారి క్రిందికి దిగి వెళ్ళి 'నా గదినిట్లా చెయ్యడానికి మీకేం అధికారంవుంద'ని అడగాలనిపించింది'' అన్నాడు.

''ఈ మనుషులకి మరేం పనిలేదనుకుంటా, వున్నవీ లేనివీ కల్పించి మాట్లాడు కోటంలో వాళ్ళకెంత ఆనందం!''

''అదే - ఒక మగాడూ ఆడదీ ఒక బావిలో చచ్చారనగానే - ఎన్ని కథలు అల్లారు - ఎన్ని అబద్ధాలు ఆడారు! అసలు లోకమే అంత. ఉదాహరణకు చెబుతా విను. నే నొకరాత్రి ఏదో ఆలోచించుకుంటూ పార్కులోకి వెళ్ళాను. అక్కడ ఎవరో మాట్లాడుకుంటున్నారు. నాకు ప్రశాంతత కావలసివచ్చింది. అందుకని పక్కనేవున్న స్త్రీల పార్కులోకి వెళ్ళాను. సాయంత్రమే అది ఖాళీ అయిపోతుందిగామరి! నా రాక చూసి ఆ తోటమాలిగాడు ఎగిరాడు- 'ఆడవాళ్ళ పార్కులో ఈ రాత్రివేళ నీకేం పని?' అని అడిగాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. చెప్పుతో ఒక్కటి ఇచ్చుకుందామన్నంత కోపం వచ్చింది. 'ఈ పార్కులోకి వస్తే మాత్రం సదుద్దేశంతో వచ్చారని ఎందుకు అనుకోవు?' అని అడిగాను, 'వీల్లేదు' అన్నాడు వాడు. సదుద్దేశమే పనికిరాదంటాడు - అర్ధరాత్రి వేళ స్త్రీల పార్కులోకి వెళ్ళటం అంటే అందులో సదుద్దేశం ఎక్కడ వుందంటాడు. లేని పోని మాటలెన్నో అన్నాడు. నా మీద ఎన్ని కథలో కల్పించటానికి సిద్ధపడ్డాడు. నేను వెనక్కు తిరిగి చూడకుండా బయటపడ్డాను. అటువంటిది- ఒక బావిలో ఒక ఆడశవం, మగశవం కనిపిస్తే కథలు రావూ! అన్నట్టు వాడెవడో అంటాడు - మనిద్దరం నవ్వుతూ వెళ్తూ వుంటే చూశాట్ట! ఇట్లా నిందగా మాట్లాడటంలో గొప్పతనం వుందనుకుంటారు కాబోలు! అసలు ఆ వేణు గాడు నాతో అంత స్నేహంగా మెలిగి అంటాడూ, నన్ను వాడు చాలాసార్లు మీ వీధిలో చూశాట్ట - వెధవని పాతిపెట్టాలి!'' అన్నాడు ఆనందరావు.

''నామీద చూశావా - మా పొరుగింటి సూర్యనారాయణ ఏమన్నాడో - అతన్ని నేను తండ్రిలాగా భావించుకునేదాన్ని - వాడిని నేను వల్లో వేసుకుందామని చూశానుట - వాడి భార్య మాత్రం మంచిదే. వాడు మాత్రం దొంగముండా కొడుకు! నేను పోకిరీదాన్నట, వేషాలు వేస్తానుట - నంగనాచినట - అబ్బబ్బ... ఈ ఆడంగులకు మరేంపనిలేదు- ఛీ ఛీ...'' అన్నది లక్ష్మి.

''మనిద్దరం నీ పెళ్ళి కాకపూర్వం నుంచీ ప్రేమికులమటగా!'' అని నవ్వాడు ఆనందరావు.

''వాళ్ళ శార్థం.'' అని లక్ష్మికూడా నవ్వింది. వాళ్ళగురించి పూళ్ళో చెప్పుకున్న కబుర్లూ, కథలూ తిరిగి చెప్పుకున్నారు. కోప్పడ్డారు - తిట్టారు - ఈ లోకాన్నీ ఈ మనుషుల్నీ నమిలి మింగేద్దాం అనుకున్నారు.

''ఇంతకూ అసలు నువ్వు ఎట్లా చనిపోయావు? ఎందుకు చచ్చిపోయావు?'' అన్నాడు ఆనందరావు.

''మా ఆయన నాగభూషణం అని విన్నావుగా, మేము చాలా బీదవాళ్లం. ఆయన అట్టే చదువుకోలేదు. ఏదో చిన్న వుద్యోగం చేస్తూ వుండేవారు. ఆ వచ్చిన డబ్బులు మా తిండికే చాలేవి కావు. నాకు పెళ్ళయి ఎన్నాళ్ళూ కాలేదు. తరవాత కొన్నాళ్లకు మా ఆయన్ను యజమాని పనిలోంచి తీసేశాడు. మాకు తినడానికి మెతుకులు లేకపోయినై. ఇంట్లోవున్న గిన్నె, చెంబూ అన్నీ అమ్మకు తిన్నాం. ఆయన ఎంత తిరిగినా ఎవడూ వుద్యోగం ఇవ్వలేదు. ఒక్కోరోజు ఏదో కూలి పనిచేసి, కొన్ని డబ్బులు తెచ్చి ఇచ్చేవారు. ఇట్లా చాలా బాధలుపడ్డాం. దరిద్రం అంతా మాకొంపలోనే వున్నట్టు కనిపించింది.

ఆఖరుకు మా ఆయన నాలుగు రోజులుగా తిండి తిప్పల్లేక ఇంటికి వచ్చి, ''నేను ఎక్కడికో పోతున్నాను. నా గురించి నువు బెంగపడమాకు. బ్రతికి వుంటే, సుఖంగా వుంటే తిరిగి వస్తాను, ఎక్కడికి వెళ్తానో నాకే తెలీదు'' - అన్నారు. నేను ఏడ్చాను, వెళ్ళొద్దని బతిమాలాను. ఆయన వినిపించుకో లేదు. మాట్లాడకుండా, గుడ్డ ముక్కయినా పైన వేసుకోకుండా, చరచరా వెళ్ళిపోయినారు. ఆయన వెళ్ళిపోయిన తర్వాత నాకు మరేం తోచలేదు. ఒక్కతెనూ ఆ గదిలో కూర్చుని ఏడ్చాను. మొత్తుకున్నాను. ఆకలిబాధకు తాళలేకపోయాను. ఇంట్లో అమ్ముకుందామన్నా ఏమీ లేదు. పైగా అప్పులవాళ్లు ప్రాణాలు తీసేస్తున్నారు, మా ఆయన ఏమైపోయారో నాకు తెలీదు. ఈ దారిద్ర్యంతో ఆయన బతికివుంటారని నమ్మకం ఏమిటి? ఏవేవో వూహించాను. ఆయనకూడా లేకుండా తిండిలేక బాధపడుతూ శవమల్లే ఎందుకు - ఎవరికోసం ఈ బతుకనిపించింది. నిన్నరాత్రి పిచ్చెత్తినట్లయిపోయాను. బాగా పొద్దుపోయాక, అర్థరాత్రివేళ ఇంటి తలుపు దగ్గరగా జేరవేసి పాడుబడిన బావిదగ్గరకు వెళ్ళాను. చావాలని నిశ్చయించుకున్నాను. మా ఆయన తిరిగి వస్తే ఒకసారి ఏడుస్తారు. అంతేగా! ఏమయినా బ్రతకటానికి ధైర్యం లేకపోయింది. ఆయన్ను సుఖంగా వుంచమని దేవుడిని ప్రార్థించి, ఆ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాను. ఇదీ నా

చావు కథ. ఇటువంటి పరిస్థితిలో నేను దిక్కుమాలిన చావు చస్తే - ఏ ఒక్కడూ జాలిపడేవాడు లేడుకదా - నామీద ఎన్ని నిందలు మోపుతున్నారో, ఎన్ని కట్టుకథలు అల్లుతున్నారో చూశావా?'' - అన్నది లక్ష్మి.

ఆనందరావు 'ఆత్మ' - నిట్టూర్చినట్టు కదిలింది.

''ఐతే నువ్వు ఆత్మహత్య చేసుకున్న తర్వాత నేను చచ్చానన్నమాట! నా కథ విను. నేను ఒక ఆఫీసులో గుమాస్తాను. నాకూ కొన్ని చికాకులు, వ్యథలు వున్నా యనుకో. ముఖ్యంగా పెళ్ళి విషయం. మా అమ్మ నన్ను త్వరగా పెళ్ళి చేసుకొమ్మని రాస్తూ వుంటుంది. నేను ఎవర్నీ ప్రేమించలేదు - నాకు ప్రేమలో నమ్మకం లేదు. కానీ చేసుకోవచ్చని వూరుకున్నాను. పైగా ఈ సంపాదన నాకే చాలటం లేదు. ఆమెనుకూడా తీసుకొచ్చి - 'సుఖపడదాం' అని వచ్చిన భార్యను కష్టపెట్టడం నాకు ఇష్టంలేదు. కాని నిన్నకూడా వో వుత్తరం వచ్చింది. ఎక్కడో పిల్ల వున్నదనీ, చేసుకుంటేనే గాని వీల్లేదనీనూ. నా పరిస్థితి ఎంత చెప్పినా వాళ్ళు అర్థం చేసుకోలేరు. ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకుంటే సుఖపడలేమని నేను అనుకుంటాను - చేసుకోకపోతే వాళ్ళకు సుఖంలేదు. ఏం చెయ్యాలో నాకు తోచలేదు. రాత్రి ఒంటి గంటదాకా గదిలో కూర్చుని తీవ్రంగా ఆలోచించాను. తల వేడెక్కిపోయింది. లేచి బయటకు వచ్చి వీధులన్నీ దాటి వూరవతలకు వచ్చాను. ఆలోచిస్తూనే ఆ బావి గట్టుమీద కూర్చున్నాను. అప్పటికప్పుడే నీ శవం బావిలో వున్నదన్నమాట. ఈ ఆలోచనతో ఏమైందో తెలుసా? అంతా విధి వైపరీత్యం. ఆ సమయానికి నాకూ చావు రాసిపెట్టివున్నది. బావి గట్టు ఎత్తయినదేం కాదుగా. నేనా గట్టుమీద వున్నానన్న ఆలోచనకూడా నాకు లేదు. ఏ బెంచిమీదనో కూచున్నాననుకుని, ఎడమచేతిని వెనక్కిచాచి - ఆన్చి చేతిమీద జేరబడదామనుకున్నాను. గట్టుమీద కూచునే చేతిని చూస్తూ వెనక్కు వంగాను అంతే; బావిలో పడిపోయాను. పడిపోతున్నప్పుడు పెద్దగా కేక కూడా వేశాను. ఆ అర్థరాత్రి సమయంలో ఆ వూరవతల నా కేక విన్నవాడెవడూ? నాకు ఈతరాదు. బావిలోపడీ పడగానే అడుక్కుపోయాను. కడుపునిండా నీళ్ళుపోయినై. ఉక్కిరిబిక్కిరి ఐపోయాను. కాళ్ళూచేతులూ కొట్టుకున్నాను. నాలోవున్న ప్రాణ వాయువు పోయింది. చచ్చిపోయాను. నాదేం ఆత్మహత్య కాదు. దురదృష్టవశాత్తూ చచ్చిన చావు. నువ్వు చావాలని చస్తే, నేను చావాలనుకోకుండా చచ్చాను. ఇదీ జరిగిన విషయం. కానీ, తెల్లవారేసరికి - మన శవాలు రెండూ బావిలో కనిపించటంవల్ల - వయస్సులో వున్నవాళ్ళం అవటంవల్లా, ఇంకేముంది? వాళ్ళ కథలకు కావలసినంత ఆస్కారం దొరికింది. శవాలు బావిలో కనిపించగానే వెంటనే వీళ్ళకు కలగాల్సింది దురాలోచనేనా? అసలు జరిగినట్టు, 'ఈవిధంగా జరిగి వుండవచ్చునేమో' అని ఒక్కడూ ఆలోచించడే!''

''కాని బావి గట్టుమీద అంత అజాగర్తగా ఎందుకు కూచున్నావు నువ్వు?'' అని మందలించింది లక్ష్మి.

''సరే, అంత జాగర్త వుంటే చావకనే పోయేవాడిని. కాని నువ్వు ఆత్మహత్య చేసుకోవటం క్షమించరానిది'' అన్నది ఆనందరావు ఆత్మ.

లక్ష్మి ఈ లోకం కేసి చూసింది. ''కాదు. ఇటువంటి నీచపు లోకాన్ని వదిలిపెట్టడమే మంచిదయిందని ఇప్పుడు అనుకుంటున్నాను. మా ఆయన లేకుండా నేను మరో రెండు రోజులు వంటరిగా బ్రతికాననుకో.. మరిన్ని అభాండాలు వచ్చి పడేవిగా. ఇంతకూ ఆయన ఎక్కడ వున్నారో - ఏమైనారో...'' అన్నది లక్ష్మి జాలిగా.

''మీ ఆయన దొరికాడనుకో. అసలు విషయం చెప్పి నేను వీళ్ళిద్దర్నీ బావిలోకి తోసి చంపలేదంటాడు - వాళ్ళు వింటారంటావా?''

''వినరు. వినేటంత సహృదయం వాళ్ళకుండదు. వాళ్ళంతా నీచంగా జీవిస్తున్నారు కాబట్టి ఇతరులూ అంతే అనుకుంటారు. ఈనాటికయినా వీళ్ళ పీడ విరగడయింది - థూ'' అన్నది లక్ష్మి ఆ గగన మార్గంనుంచి భూమికి ఉమ్ముతూ.

''నిజం నిలకడమీద తేల్తుందని అంటారు. అట్లా ఒకవేళ ఈ నిజం తెలిశాక మనమీద ఈ అభాండాలూ, నిందలూ మోపిన ఈ వెధవల ముఖాలు ఎట్లా వుంటాయి? వీళ్ళందరికి వరసనా ఉరిశిక్ష వెయ్యాలి!'' అన్నాడు ఆనందరావు ఉక్రోషంగా.

ఆ విషయం గురించి ఈ రెండు ఆత్మలూ మళ్ళీ చర్చించలేదు. ఏవో విషయాలు ఆలోచిస్తూ వెనక్కు తిరిగి చూడకుండా తాము చేరాల్సిన మరో లోకానికి వడివడిగా పోసాగినై. □